క్లుప్తంగా

ఇటొస్తే.. ప్రమాదమే



శావల్యాపురం :స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట కల్వర్టు పగలి ప్రమాదాలకు నిలయంగా మారింది. మండల ప్రజలు వివిధ పనులపై ద్విచక్రవాహనం, కారుల్లో తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చే వారు ఇది గమనించక కాల్వలో పడిపోతున్న సందర్భాలు లేకపోలేదు. రాత్రి సమయంలో ఈ ఇబ్బంది మరింత ఎక్కువగా ఉంది. సత్వరమే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

వాహనాలు ఇవ్వొద్దు

వినుకొండ(నూజెండ్ల): మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టప్రకారం నేరమని సీఐ ఎస్.సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పండ్ల దుకాణాల యజమానులతో కౌన్సెలింగ్ ఇచ్చి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని, అధికారులకు సహకరించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ట్రాక్టర్ ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పురపాలక సంఘం కార్యాలయం వద్ద నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం ప్రారంభించారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన వాహనాలను కొనుగోలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. బాల్యవివాహాల నిరోధక పరిరక్షణ చట్టం రాష్ట్ర గౌరవ సభ్యులు బత్తుల పద్మావతి, మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసులు, ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరితో పాటు పలువురు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన రావులపల్లి సాంబయ్య పశువుల పాక (కోష్టం) శనివారం అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లగా పాడి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి.

మోదీ పాలనలో అభివృద్ధి

రొంపిచర్ల : ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ పల్నాడు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మేళం మధుబాబు అన్నారు. మండలంలో సంతగుడిపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి బీజేపీ మండల అధ్యక్షుడు కాటా అంజనారెడ్డి అధ్యక్షత వహించారు కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శామ్యూల్, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి హనుమంతరావు, బీజేపీ మండల నాయకులు వెంకట్రావు పాల్గొన్నారు.

ఫిట్టర్లకు ఒకరోజు శిక్షణ

నరసరావుపేట: జిల్లా సూక్ష్మనీటిసాగు అధికారి కార్యాలయంలో జిల్లా అధికారి సీహెచ్. ఆంజనేయులు సారథ్యంలో శనివారం బిందు సేద్య పరికరాలు అమర్చే విధానంపై ఫిట్టర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఓఎస్డీ డి.రమేష్ పాల్గొని ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఇంజనీరు బద్దూనాయక్, జిల్లా కో ఆర్డినేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

31న వేలం పాట

బొల్లాపల్లి: దేవదాయ పరిధిలోని మాన్యం భూములకు వేలం పాట నిర్వహిస్తున్నామని ఆ శాఖ అధికారి బి.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెల్లటూరు గ్రామంలో రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 31న వేలం పాట నిర్వహిస్తామన్నారు.

నేడు బిల్లులు చెల్లించవచ్చు

చిలకలూరిపేటటౌన్: ఆదివారం సెలువు దినమైనప్పటికీ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి అవకాశం కల్పిస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి బిల్లులు చెల్లించవచ్చన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతున్నది. పాఠశాల స్థాయి విద్యార్థులలో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించటంతో పాటు వేసవి సెలవులను సద్వినియోగపరుచుకునేందుకు హాజరవుతున్నారు.

గడపగడపలో సంతోషాల స్వాగతం

- ప్రభుత్వ పనితీరే ప్రజల ఆదరణకు నిదర్శనం
- వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరాభిమానాలే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని కావూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఏ పథకం ద్వారా ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అవసరాలు తెలిసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలితంగా ప్రతి పేద కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నదని వివరించారు. అమ్మఒడి, విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాల ద్వారా పేద విద్యార్థులు బడి చదువుల నుంచి ఉన్నత చదువుల వరకు ఉచితంగా పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. చదువే అభివృద్ధి మూలమని చెప్పారు. పేదోడికి ఏ కష్టం వచ్చినా తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు ఒక ఎత్తయితే, ముఖ్యమంత్రి సహాయ నిధి, పంట నష్టపరిహారం, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం ప్రతి సామాన్యుడికి అవసరమైన సమయంలో అండగా ఉంటోందని తెలిపారు. ఇలాంటి గొప్ప ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ, ఎవరూ చూడలేదని చెప్పారు. విద్యతో పాటు ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నదని తెలిపారు. గ్రామగ్రామాన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రతి సామాన్యుడి ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్య సేవలు లభిస్తున్నాయని తెలిపారు. నాడు–నేడు పథకం అమలుతో పేదల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ హంగులను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరుతో ప్రజలు గడపగడపకూ కార్యక్రమానికి విచ్చేసిన తమకు సంతోషాల స్వాగతం పలుకుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా యాములయ్య, కక్కెర శ్రీనివాసరావు, నాగభైరు వెంకట్, కందుల ఆంజనేయులు, చినబాబు, గుమ్మడిదల నాగేశ్వరరావు, జెట్రిపోతుల కరుణామయుడు, బోడియ్య, అంకమ్మ, ఇజ్రాయేలు, రమణయ్య, కందుల వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి, అభివృద్ధికి కేరాఫ్ జగనన్న

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- విప్పర్ల రెడ్డిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



ఎమ్మెల్యే గోపిరెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

రొంపిచర్ల: సంక్షేమానికి, అభివృద్ధికి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గీటురాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ఇప్పటివరకు గ్రామంలో రూ.27 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. రూ.2.20 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని ప్రారంభించారు. రూ.15 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, రూ.16 లక్షలతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకటరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ వట్టికొండ అంజయ్య, నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి, సర్పంచు బత్తుల అంజయ్య, పడాల చక్రారెడ్డి, గుండాల వెంకటేష్, పచ్చవ రవీంద్రబాబు, దుద్దుకుంట సైదులురెడ్డి, వరికూటి శ్రీనివాసరెడ్డి, పాలిమేర శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దుద్దుకుంట యోగిరెడ్డి, గుంటక వెంకటేశ్వరరెడ్డి, బోడె సైదులురెడ్డి, గంగారపు ఓబులురెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యాబుద్ధులే ఆధారం

నరసరావుపేట: పిల్లలకు చిన్నతనం నుంచే మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తే వారు జీవితంలో గొప్ప వ్యక్తులుగా రాణించగలుగుతారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పేర్కొన్నారు. శనివారం బరంపేటలోని బ్రహ్మానందరెడ్డి హైస్కూలు వద్ద మదర్సాలో చదువు పూర్తిచేసుకున్న ఇస్లామిక్ బేసిక్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు షేక్ ఖాజా బాబు ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందజేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో బాల్యవివాహాల నిరోధంపై అంగన్‌వాడీలు, ప్రజాప్రతినిధులకు అవగాహన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రజాప్రతినిధులు ముఖ్యపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సూచించారు. స్థానిక జాషువా కళాప్రాంగణంలో బాల్య వివాహాల నిషేధిత చట్టం 2006పై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, గ్రామ సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి బాల్యవివాహాల నిషేధంలో చిత్తశుద్ధిగా చట్టాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. దిశ చట్టం, మహిళా గ్రామ పోలీస్ వ్యవస్థను ఏర్పా టు చేసి గ్రామాల్లో నూతన వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏ గ్రామంలోనైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు గుర్తిస్తే ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ప్రయత్నాన్ని ఆపాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చదువు లేకపోతే వ్యవస్థలో మార్పురాదని గుర్తించిన ముఖ్యమంత్రి అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను ఏర్పాటు చేసి బాల్య వివాహాల నిరోధానికి పరోక్షంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. బాల్యవివాహాల నిరోధక పరిరక్షణ చట్టం రాష్ట్ర గౌరవ సభ్యులు బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడం బాధ్యతగా తీసుకొని అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షతన ఉండే కమిటీలు బాధ్యతాయుతంగా బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. వినుకొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16 బాల్య వివాహాలను అడ్డుకోవడం, వారికి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. చట్టాలపై కూడా అవగాహన కల్పించి పోలీస్, న్యాయ వ్యవస్థలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టం ద్వారా విద్యార్థులను ఇంటర్ వరకు చదువు ఆపకుండా చర్యలు చేపట్టినప్పుడు బాల్య వివాహాలు ఆగిపోతాయని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, సీడీపీవో అనురాధ, వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరి, చిన్నపరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో మంగాపురనాథ్‌లతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామసచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ అంజిరెడ్డి ఆస్పత్రిలో చిన్నపిల్లల గుండె వైద్యవిభాగం



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో మొట్టమొదటి సారిగా సత్తెనపల్లిరోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చిన్నపిల్లల గుండె వైద్య విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్పిటల్‌లో చిన్నపిల్లలకు ఉచిత గుండె వైద్యశిబిరం ప్రతి రెండో సోమవారం, నాల్గో శనివారం నిర్వహిస్తున్నామన్నారు. గుండెలో రంధ్రాలకు వాల్వ్ రీప్లేస్మెంట్, గుండె అతిగా కొట్టుకోవడం, గుండె వీక్‌గా ఉండటం మొదలైన పుట్టుకతో వచ్చే అన్ని రకాల జబ్బు లకు ప్రముఖ డాక్టర్లచే వైద్యసేవలు అందజేయబడతాయన్నారు. చిన్నపిల్లల గుండె వ్యాధుల శాస్త్ర నిపుణులు మొట్టమొదటిసారిగా తమ అంజిరెడ్డి హాస్పిటల్‌లో గుండెకు సంబంధించిన అన్నీ రోగాలకు స్టార్ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ గుడిపాటి రాజేష్ వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఈ చిన్నపిల్లల గుండె వైద్య సేవల్ని పలనాడు, పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ కనెక్షన్లతో మంచినీటి సమస్యకు పరిష్కారం



డాక్టర్ అమర్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

చిలకలూరిపేట: పైపులైన్ ఇంటర్ కనెక్షన్ల ప్రక్రియ పూర్తి చేయడం ద్వారా పట్టణంలో పలుచోట్ల తలెత్తుతున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శనివారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు చైర్మన్ సమాధానం చెబుతూ పైపులైన్ ఇంటర్ కనెక్షన్ల పనులు జరుగుతున్నాయని, ఇది పూర్తి అయితే శివారు ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉండదని చెప్పారు. విలీన గ్రామాలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించి చైర్మన్ మాట్లాడుతూ కోర్టు వివాదాల కారణంగా విలీన గ్రామాల సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఎదురౌతున్నాయని చెప్పారు. కోర్టు సమస్యలను అధిగమించి త్వరలోనే విలీన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణంలో కుక్కల సమస్య తీర్చాలని అడిగిన ప్రశ్నకు తగు చర్యలు తీసుకుంటామని అధికారులు సమాధానం చెప్పారు.

పలువురికి సన్మానం

స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలకు సంబంధించి స్వచ్ఛ ఆస్పత్రి కింద ప్రగతి నర్సింగ్ హోంకు, స్వచ్ఛ స్కూల్ కింద ఏఎంజీ స్కూల్‌కు, స్వచ్ఛ హోటల్‌గా పద్మనాభయ్య హోటల్‌కు పురస్కారాలు అందజేశారు. కోవిడ్‌లో సైతం ఉత్తమ సేవలు అందించినందుకు ప్రగతి నర్సింగ్ హోంకు చెందిన డాక్టర్ కొల్లా అమర్‌ను సన్మానించారు. ఆయనతో పాటు సేవా రంగానికి సంబంధించి చుక్కా విన్సెంట్‌పాల్, పూసపాటి బాలాజీలను సన్మానించారు. ఎజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు.

శిక్షణ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు వనరులు, పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకొని పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కొండా సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించి రెండు నెలల పాటు జిల్లాలోని పలు ప్రదేశాల్లోని స్కిల్‌హబ్‌సెంటర్లలో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. వినుకొండ ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ బ్యుటీషియన్ కోర్సుకు 30 మందికి శిక్షణ ఇవ్వబడుతుందని, పి.శ్రీకాంత్, 94921 58153నంబరును సంప్రదించాలని కోరారు.

పాదయాత్ర బృందానికి ఎమ్మెల్యే అభినందన

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2024లో తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఇడుపులపాయ నుంచి తాడేపల్లి వరకు చేస్తున్న పాదయాత్ర వినుకొండకు చేరుకుంది. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం మండల అధ్యక్షులు దేవరకొండ నాగేశ్వరరావు, అంకమరావు, రాము, నాగరాజులు ఈ నెల 16వ తేదీ నుంచి ఇడుపులపాయ నుంచి పాదయాత్రగా తాడేపల్లి సీఎం కార్యాలయం వద్దకు వెళ్తూ వినుకొండకు చేరుకున్నారు. పాదయాత్ర బృందానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మీరు కోరుకుంటున్నట్లే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరెడ్డి, ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు

చిలకలూరిపేట: మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని చౌత్రా సెంటర్‌లో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లు, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తలిదండ్రులు బాధ్యత లేకుండా మైనార్టీ నిండని వారికి ద్విచక్రవాహనాలు ఇవ్వడం కారణంగా తెలిసీ, తెలియని వయసులో అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమౌతున్నారని పేర్కొన్నారు. యువత ఒక్కో బైక్‌పై ముగ్గురు, అంతకు మించి ఎక్కి అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు హేతువుగా నిలుస్తున్నారని వెల్లడించారు. ఇకపై ఇలాంటి బాధ్యతా రాహిత్య చర్యలను సహించమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా పలువురిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐలు ఎం మోహన్, ఎస్‌కెఎండీ ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత ప్రదేశాల్లోనే నిర్వహించాలి

నరసరావుపేట: పట్టణంలో పోలీసులు నిర్దేశించిన ప్రదేశాల్లోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలని డీఎస్పీ కేవీ మహేష్ చిరు వ్యాపారులను కోరారు. శనివారం పట్టణ సీఐలు, ట్రాఫిక్ అధికారులతో కలిసి గడియారం స్తంభం సెంటర్, లాల్‌బహుదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్‌ను పరిశీలించారు. పండ్లు, పూలు, కూరగాయలు విక్రయించే తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్లపైకి తమ బండ్లు పెట్టి వ్యాపారం చేస్తూ ట్రాఫిక్‌కు అవరోధం కలిగించటాన్ని గుర్తించారు. వారందరినీ పిలిచి పోలీసులు ఏర్పాటుచేసే ప్రదేశంలోనే బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తూ ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ఒన్‌టౌన్, టుటౌన్ సీఐలు అశోక్ కుమార్, వీరేంద్రకుమార్, ట్రాఫిక్ సీఐ రత్నకుమార్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో బీసీ కాలనీలో ఉచితంగా టైఫాయిడ్ టీకా శిబిరాన్ని నిర్వహించినట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు శనివారం తెలిపారు. 2 నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులకు టైఫాయిడ్ జ్వరం రాకుండా టీకా దోహదపడుతుందన్నారు. ఈటీకా సురక్షితమైనదని, ఎటువంటి సైడు ఎఫెక్ట్స్ రావని ఒక డోసు టీకా చేయించుకుంటే మూడు సంవత్సరాల పాటు టైఫాయిడ్ జ్వరం రాదన్నారు. భారత్ బయోటిక్ సంస్థ వారి టైప్‌బార్ టీకాను చేసినట్లు చెప్పారు. ఈశిబిరంలో 140 మంది పిల్లలకు టీకా చేసినట్లు చెప్పారు.దాతల సహకారంతో రూ.10 వేల వ్యయంతో ఉచిత టీకా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మొగిలి సుభాష్, దోర్నా ఏడుకొండలు, కొణదెన వీరాంజినేయులు, రవికుమార్, ఆశ కార్యకర్తలు కుంభా కమల, దొప్పలపూడి దయమణి కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

వినుకొండ(నూజెండ్ల): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఇంటికి వెళ్తున్న ఓ యువతి రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఈ సంఘటన వినుకొండ రూరల్ మండలం నరగాయపాలెం వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఈపూరు మండలం కొచ్చర్ల ఉప్పరపాలెం గ్రామానికి చెందిన మణికా శిరీషా (20) వినుకొండలో పరీక్షలు రాసేందుకు వచ్చింది. తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వేగంగా రావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో శిరీషకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వినుకొండకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదాయ మార్గాలు చూపేందుకు చర్యలు

వినుకొండ(నూజెండ్ల): ఆర్టీసీని అన్నివిధాలా లాభాల బాట పట్టించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ డీపీటీవో శ్రీనివాసరావు వెల్లడించారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల భద్రతతో పాటు మెరుగైన రవాణా సౌకర్యాలు అందిస్తూనే ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఆర్టీసీ ఆస్తులను లీజుకు ఇచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ ఆస్తులను గుర్తించి లీజుకు ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే బస్టాండ్‌లలో ప్రయాణికుల రక్షణ కొరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.